ప్రారంభమైన కరుమారియమ్మ బోనాలు



కీసర: కీసరగుట్ట అటవీ ప్రాంతంలో తమిళుల ఆరాధ్య దైవమైన కరుమారియమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజైన సోమవారం ఉదయం కరగతీర్థం ఉత్సవం, అమ్మవారి ఘటం కార్యక్రమంలో పెద్దఎత్తున తమిళులు పాల్గొన్నారు. నేడు బోనాల ఉత్సవాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.

ఘనంగా మల్లన్న కల్యాణం

మేడ్చల్: మున్సిపాలిటీలోని మల్లన్న ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం జాతర మహోత్సవాలు, కల్యాణోత్సవం సంప్రదాయబద్ధంగా చేపట్టారు. మున్సిపల్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు, మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్ పాల్గొని డోలు వాయించి నాయకులను ఉత్సాహపరిచారు.

తై బజార్ వేలం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ తైబజార్ వేలంపాట సోమవారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ స్వామి సమక్షంలో నిర్వహించిన బహిరంగ వేలంపాటలో పాల్గొనగా రూ.21,54,000లకు మలిగె కిషన్ తైబజార్ సొంతం చేసుకున్నారు. మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, అధికారులు మహిపాల్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి, సత్తయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, మల్లికార్జున్, హేమంత్‌రెడ్డి, బాలరాజ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

దళితుల జనాభాకనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

జవహర్‌నగర్: దళితుల జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ దళితభవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. సమాజంలో అత్యంత వెనుకబాటుతనానికి గురౌతున్నది దళితులమేనని, జనాభాకు అనుగుణంగా వారి అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్, నాయకులు సహదేవ్, యాకస్వామి, సుప్రియరెడ్డి, నర్సింహ, యాదగిరి పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ఒడిశా నుంచి ముంబాయికి తరలిస్తుండగా ఘట్‌కేసర్‌లో స్వాధీనం

పోచారం: ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి ముంబాయికి కోణార్క్ రైల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 10 కిలోల గంజాయిని సోమవారం ఎస్‌టీఎఫ్‌డీ టీమ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన దాంపా ప్రదాన్ అనే వ్యాపారి ముంబాయికి 10 కిలోల గంజాయిని తరలించడానికి నందిగోస నాహక్ (21) అనే వ్యక్తిని ఏర్పాటు చేసుకున్నాడు. భువనేశ్వర్ నుంచి ముంబాయికి గంజాయి తీసుకెళ్తే నాహక్‌కు రూ.15 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నారు. కోణార్క్ రైల్లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారన్న సమాచారంతో కోణార్క్ దిగి కాకతీయ రైలు ఎక్కాడు నాహక్. కాకతీయ రైల్లో కూడా తనిఖీలు జరుగుతున్నాయనే భయంతో ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో గంజాయితో దిగాడు. బస్సుమార్గంలో మరో రైల్లో ముంబాయికి వెళ్లాలని ప్రయతిస్నున్న క్రమంలో ఎస్‌టీఎఫ్‌డీ టీమ్ సీఐ నాగరాజ్, ఎస్సై జ్యోతి, ఇతర సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద రూ.5 లక్షల విలువ చేసే 10 కిలోల గంజాయి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితో పాటు గంజాయిని నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

తప్పిన ప్రాణాపాయం

మేడ్చల్‌రూరల్: విద్యుత్ పనులు చేస్తుండగా సరఫరాను పునరుద్ధరించడంతో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురైన ఘటన మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి, కిష్టాపూర్‌లో జరిగింది. వివరాల ప్రకారం .. సోమవారం కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధి ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యం పెంచేందుకు మరమ్మతులు చేపట్టారు. కాగా కొత్త విద్యుత్ తీగలు వేసేందుకు ఔట్ సోర్సింగ్ కార్మికులతో పనులు చేయిస్తుండగా అక్కడే మద్యం మత్తులో ఉన్న లైన్‌మెన్ మాధవరెడ్డి పనులు చేస్తున్న వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సబ్‌స్టేషన్‌కు తెలిపారు. దీంతో విద్యుత్ పనులు చేసేందుకు స్తంభంపై ఉన్న ఓ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. బాధిత వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. కాగా ' పనులు చేస్తున్నవారికి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ ఎలా ఆన్ చేస్తారని', 'మా ప్రాణాలతో చెలగాటమాడుతారా'.. అంటూ తోటి కార్మికులే లైన్‌మెన్ మాధవరెడ్డిని స్తంభానికి కట్టేసి చితకబాదారు. సుమారు గంటకు పైగా లైన్‌మెన్‌ను కట్టేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కట్లు విప్పి మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ముందుగానే ప్రకటించినా సంబంధిత శాఖ అధికారులు మధ్యలోనే ప్రారంభించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరీక్షల సమయం.. వద్దు భయం



విద్యార్థినులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ గౌతమ్ (ఫైల్)



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

మేడ్చల్‌రూరల్: ప్రతి విద్యార్థి జీవితంలో పదోతరగతి తొలిమెట్టు. మొట్ట మొదటిసారిగా వార్షిక పరీక్షలను ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఎంతో ఆందోళన ఉంటుంది. తమ పిల్లలు ఎలా పరీక్షలు రాస్తారని, మరోవైపు తల్లిదండ్రులు సైతం గాబరా పడుతుంటారు. దీనితో పాటు తమ పిల్లలు బాగా చదివి మంచి గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించాలని పరితపిస్తుంటారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఈ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పదోతరగతి విద్యార్థుల కోసం సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

విద్యార్థులు పాటించాల్సినవి...

- పరీక్షలు వస్తున్నాయనే భయంతో అదే పనిగా చదవడం మంచిది కాదు. బట్టీ పట్టి చదవకుండా ప్రతీ విషయాన్ని అర్థం చేసుకుంటూ చదవాలి.
- ఆహార పదార్థాల విషయంలో తొందరగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవాలి. తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి.
- చదివిన అంశాన్ని విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. కనీసం రోజుకు 8 గంటల సమయం తప్పకుండా నిద్రకు వెచ్చించాలి.

తల్లిదండ్రులకు సూచనలు..

- పరీక్షలు దగ్గరపడున్నాయని, ఒకే పనిగా చదవమని విద్యార్థులను తల్లిదండ్రులు ఇబ్బంది పెట్టొద్దు.
- పిల్లలు చదువుతున్నప్పుడు వారికి ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి. సెల్‌ఫోన్లు, టీవీల నుంచి దూరంగా ఉండేలా చూసుకోవాలి.
- ఇతర విద్యార్థులకు ఎక్కువ మార్కులు వస్తున్నాయని, వారితో పోల్చుకుని ఒత్తిడికి గురిచేయకూడదు.

భయం వీడి... ప్రణాళికతో ముందుకు

భవిష్యత్తులో ముందుకు సాగాలంటే ప్రతీ విద్యార్థి విజయానికి ప్రణాళిక తప్పనిసరి. క్రమ పద్ధతిలో ముందుకు సాగితే అవలీలగా లక్ష్యాన్ని చేరుకోవచ్చు. తమ బలం, బలహీనతలను సరిచూసుకోవాల్సిన అవసరం ఉంది. ఒత్తిడిని అధిగమించి అనవసరమైన ఆందోళనకు గురై అనారోగ్యానికి గురికావొద్దు.

– రంగాచారి, మండల విద్యాధికారి

ఆందోళన పడకుండా ఇష్టపడి చదవాలి..

విద్యార్థులు తమ పరీక్షలు దగ్గరపడుతున్నాయనే ఆందోళన చెందకుండా చదువుతున్న విషయంపై ఇష్టం పెంచుకుని చదవడం ద్వారా తొందరగా అర్థమౌతుంది. మనస్సును ప్రశాంతంగా పెట్టుకుని చదవడం వల్ల పాఠ్యాంశం కూడా అర్థమౌతుంది. సమయపాలనతో ఇష్టపడి చదివితే అధిక మార్కులు సాధించవచ్చు.

– ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయుడు

ప్రశ్నాపత్రాన్ని అర్థం చేసుకోవాలి..

పరీక్షల సమయంలో ఇచ్చిన ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి. అప్పుడే సమాధానం రాయడం తేలిక అవుతుంది. చేతిరాత అందంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే అధిక మార్కులు పొందవచ్చు. ఇచ్చిన ప్రశ్నకు ఎన్ని మార్కులు ఇచ్చారో గమనించి క్లుప్తంగా రాయాలి. బాగా తెలిసిన ప్రశ్నకు సమాధానాన్ని నెంబర్ వేసి ముందు రాసుకోవాలి. సామాన్యశాస్త్రంలో పట్టిక, ప్రయోగం, బొమ్మలు గీసిన అనంతరం వివరణ, విశ్లేషణ రాయడం వల్ల పూర్తి మార్కులు ఇస్తారు.

– బేబి, ఉపాధ్యాయురాలు

విద్యార్థులకు సాధన తప్పనిసరి

విద్యార్థులు గణితం, ఇంగ్లిష్ అంశాలు అంటేనే భయపడతారు. వారిలో భయం పోవాలంటే సూత్రాలను ఆధారం చేసుకుని గణితాన్ని సాధన చేయాలి. తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లిష్‌లో మెలకువలు పాటిస్తూ ఇచ్చిన ప్రశ్నలను పదేపదే చదివి అర్థం చేసుకుని ఆ తర్వాత సమాధానం రాయాలి. కనీసం 8గంటల నిద్ర అవసరం. పరీక్షల హడావిడిలో పడి ఆహారం సరిగ్గా తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు.

– రంగాచారి, ఎంఈఓ మేడ్చల్

పేదలకు న్యాయం జరిగేలా చూస్తాం

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో 100 ఫీట్ల రోడ్డును 80 అడుగుల మేరకు తగ్గించాలని మెయిన్ రోడ్డు ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తిని సీఎం దృష్టికి తీసుకెళ్తానని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్ అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ తిరుమల గార్డెన్‌లో అసోసియేషన్ అధ్యక్షులు ఏనుగు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత రహదారిని 100 అడుగల మేర విస్తరించేందుకు ప్రభుత్వం, చర్యలు చేపడుతుందన్నారు. దీని ద్వారా తమకు అన్యాయం జరుగుతుందని, ప్రధాన రహదారిలోని ప్లాట్స్, ఇళ్ల యజమానులు తన దృష్టికి సమస్యను తీసుకొచ్చారన్నారు. వీరందరికీ తగిన న్యాయం చేసేలా చూస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ నాగమణి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్ప రామరావు, మాజీ సర్పంచ్ రామారం , వెంకటేష్‌గౌడ్, నేతలు కందాడి శ్రవణ్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రావల్‌కోల్ కేంద్రంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేయండి

మేడ్చల్: మండలంలోని గ్రామపంచాయతీలను కలుపుతూ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నందున రావల్‌కోల్ కేంద్రంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, మండల కార్యదర్శి నరేష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రావల్‌కోల్ గ్రామానికి అనుబంధంగా గిరిజన తాండాలు ఉన్నాయని, పంచాయతీలు కూడా కొద్దిదూరంలోనే ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ భవనాలు నిర్మించుకోవడానికి రావల్‌కోల్ పరిధిలో ప్రభుత్వస్థలం అధికంగానే ఉందని, జనాభా కూడా అధికంగా ఈ గ్రామపరిధిలోనే ఉన్నారని వివరించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

అంగన్‌వాడీలకు రూ.18వేల జీతం ఇవ్వాలి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన 48 గంటల ఆందోళన కార్యక్రమాన్ని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీత, శోభారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం రూ.18వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు,ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో సీఐటీయూ అధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాన్ని ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. ఈ ఆందోళనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాస్, బి.లింగస్వామి, జ.వెంకన్న, పి.గణేష్, చంద్రశేఖర్, ఉన్ని కృష్ణ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శివరాణి, శైలజ, రమాదేవి, భాగ్య, భాగ్యరేఖ, అంగన్‌వాడీ టీచరుర్లు, హెల్పర్లు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పురపాలక సంఘాల్లో విలీనమైన మున్సిపల్ కార్మికులకు 4 నెలలు జీతాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి శివబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ఆందోళనకు దిగారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు అందజేశారు.

ఆశావర్కర్లపై వేధింపులు అరికట్టాలి

సాక్షి,సిటీబ్యూరో: ఆశావర్కర్లపై వేధింపుల ఆరికట్టాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి, జిల్లా నాయకురాలు రాధా, యాదమ్మ, లలిత, కోమలత, మంగ పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలని మంత్రికి వినతి

జవహర్‌నగర్: విద్యుత్ బకాయిలు చెల్లించాలని రజక రిజర్వేషన్ సమితి సభ్యులు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. గతంలో కేటాయించిన విధంగా రూ.150 కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని, రజక వృత్తిదారుల సంక్షేమం కోసం ఎలాంటి బ్యాంకు షరతులు లేకండా రూ.2 లక్షల లోన్ ఇవ్వాలని కోరారు. సాంబరాజ్‌కుమార్, శాగంటి వెంకటేష్, సాయికుమార్ తదితరులున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మేడ్చల్: అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్ ఇచ్చిన స్టడీ మెటీరియల్‌ను స్థానిక నాయకులు అందజేశారు. విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా రాయాలని సూచించారు. బీజేపీ నాయకులు నందారెడ్డి, శైలజ, ఈశ్వర్, వంశీధర్‌రెడ్డి, మహేష్, బాబురాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహిళపై ఫిర్యాదు

కీసర: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహిళపై తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం కాంగ్రెస్ నేతలు కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పుశ్రీనివాస్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సుర్వి స్వప్నఅరవిందగౌడ్, నేతలు సతీష్‌గౌడ్, అరుంధతి, ముంతాజ్, వేణుగోపాల్, శేఖర్, షేక్‌గౌస్, మనోహర్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడిని కత్తితో పొడిచి..

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడు కబిచంద్ర

కీసర: క్షణికావేశంలో తోటి కార్మికుడిని హత్య చేసిన కేసులో నిందితుడికి మల్కాజిగిరి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. కీసర ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. 2024లో గోధుమకుంట గ్రామంలోని సూర్ ఫీడ్ సెంటర్ కోళ్ల ఫారంలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. కోళ్ల పెంపకం కేంద్రంలో ఒడిశాకు చెందిన దినసరి కూలీ బబ్లూనాయక్ కబిచంద్రకు మధ్య గొడవ జరిగింది. పాత గొడవను మనసులో ఉంచుకున్న నిందితుడు కబిచంద్ర అదే రోజు సాయంత్రం బబ్లూనాయక్ ఇంటికెళ్లి గొడవకు దిగి చాకుతో బబ్లూనాయక్ కడుపులో పొడిచాడు. కత్తిపోటుకు గురైన అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కీసర పోలీసులు ఏడాదిలోనే నిందితుడికి శిక్షపడేలా చేశారు. ఈ కేసు దర్యాప్తుపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు పోలీసులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తులు తాత్కాలిక ఆవేశానికి లోనై చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని సూచించారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఘట్‌కేసర్: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఇన్‌చార్జ్ మండల విద్యాధికారి శ్రీధర్ అన్నారు. సోమవారం అంకుషాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లితండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు అనంతయ్య మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఏపీపీసీ చైర్‌పర్సన్ పద్మ, ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

శామీర్‌పేట్: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరేందుకు పట్టుదలతో కృషి చేయాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌ఫోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) మెంబర్ జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బాలేష్ అధ్యక్షతన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రావంత్‌రెడ్డి తన తండ్రి దేవేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ సామగ్రిని అందజేసి, అనంతరం హాల్‌టికెట్లు ఇచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కట్ట మీనాకుమారి, మాజీ కౌన్సిలర్ నర్సింగరావుగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హరికృష్ణారెడ్డి, తిరుమలప్రసాద్, ప్రశాంత్‌నాయక్, రమేష్‌చంద్ర, శశిరేఖ, హేమలత, మంజులత, నిర్మల, జ్యోతి, లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా చదువులో రాణించాలి



కీసర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు దీటుగా చదువుల్లో రాణించాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం నాగారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు శ్రద్ధతో ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను నేర్చుకుంటే చదువుల్లో చక్కగా రాణించగల్గుతారన్నారు. 1967లో నాగారంలో తెలుగు మాధ్యమంలో ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమైన పాఠశాల 1975లో ఉన్నత పాఠశాలగా ఏర్పాటైందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2024–2025) లో ఎన్ఎంఎంఎస్ పోటీల్లో పాల్గొని స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను అభినందించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాములు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రస్తుతం, పూర్వ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యమం ఆగదు

7వ రోజుకు ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు



నిరసన దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ

కీసర: మందకృష్ణ మాదిగ గత 30 ఏళ్లుగా చేస్తున్న పోరాట ఫలితంగానే నేడు ఎస్సీ వర్గీకరణ స్వప్నం సాకారం అవుతోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే వరకు గ్రూప్ 1,2,3,తో పాటు అన్ని రకాల ఫలితాలు నిలిపేయాలన్న డిమండ్‌తో ఎమ్మార్పీఎస్ చేస్తున్న నిరసన దీక్ష 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీవర్గీకరణ మాదిగల 70 ఏళ్ల ఆకాంక్ష అని అన్నారు.వర్గీకరణ లేకపోవడం వల్లనే మాదిగ జాతి విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యంగా మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌మాదిగ, మండల ఇన్‌చార్జ్ జగన్, కీసర మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మహేందర్, ఉపాధ్యక్షులు తుడుం శ్రీనివాస్, బాల్‌రాజ్, సుధాకర్, నర్సింగ్‌రావు, అరవింద్, నగేష్, భాస్కర్, రవి, పవన్, అభి పాల్గొన్నారు.

అమరవీరుల స్మారక ర్యాలీ



ఘట్‌కేసర్: అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను స్మరించుకుంటూ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అవినాష్, ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ.. మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు సుబ్బు, శ్యామ్, ఉపాధ్యక్షుడు శ్యామ్‌మండల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అనిల్, మనోజ్, నాయకులు వినయ్, శ్రీరామ్, జితేందర్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ కేసులో నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: మద్యానికి బానిసై చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 26న మర్పల్లిగూడలోని దుర్గమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైంది. స్థానికుడు సోమసాని ఈశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వారి దర్యాప్తులో భాగంగా సీసీ పుటేజీల ఆధారంగా నిందితులు జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్మికనగర్‌కు చెందిన పసునూరి నవీన్ (20), గబ్బిలాపేట్‌కు చెందిన మహ్మద్ సలీం (19)గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు సాయి, సంతోష్‌లు పరారీలో ఉన్నట్లు సమాచారం. నిందితుల నుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్సీలకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- నేడు జిల్లాకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎస్సీలకు వారి వాటా ప్రకారం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టరు గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు మంగళవారం జిల్లాకు రానున్న సందర్భంగా సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందించే రైతు భరోసా, రైతు బీమా, రుణ మాఫీ, గృహలక్ష్మి, స్వయం సహాయక బృందాలకు రుణాలు, మహిళా శక్తి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి తదితర పథకాల అమలుపై ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, సీపీఓ శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, హౌజింగ్ ఈఈ రమణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, పరిశ్రమలు అధికారి ప్రశాంత్, సివిల్ సప్లై అధికారి సుగుణబాయి, మెడికల్ అండ్ హెల్త్ అధికారి ఉమాగౌరి, జిల్లా ఉపాధి అధికారి రాధిక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలి

సాక్షి,సిటీబ్యూరో: కలెక్టరేట్ ప్రజావాణితో సహా పురపాలక సంఘాలు, మండల స్థాయి కార్యాలయాల్లో వచ్చే ఫిర్యాదులు, వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఆయన స్వీకరించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 73 ఫిర్యాదులు సంబంధిత అధికారులకు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... జిల్లా అధికారులు జాప్యం లేకుండా దరఖాస్తులను పరిష్కరించి దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.